నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, బుధవారం 28 మే 2025 SIDDIPET


సిద్దిపేటలో ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో
# కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట నియోజకవర్గంలోని పేద పద్మశాలీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ

సిద్దిపేట, మే 27: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి సిద్దిపేట నియోజకవర్గ పద్మశాలీలకు రూ.5లక్షల విలువ కలిగిన 50 కుట్టు మిషన్లను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పద్మశాలీలు, చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామన్నారు. జకత్ మగ్గాలు, సిద్దిపేట గొల్లభామ చీరలకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చామన్నారు. నేత కార్మికులకు చేతినిండాపని కల్పించి ఆదుకున్నామన్నారు. పాలనపై కాంగ్రెస్ పట్ల ప్రజలు విసిగిపోయారన్నారు. మహిళలు కుట్టు మిషన్ ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం పొంది పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల సాయిరామ్, గుండు భూపేశ్, బూర విజయ మల్లేశం, అడ్డగట్ల శేఖర్, పద్మశాలీ సమాజం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీశ్, ముదిగొండ శ్రీనివాస్, సంగు పురేందర్, విఠల్ పాల్గొన్నారు.


సిద్దిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

# తేమశాతం రాగానే ధాన్యం కొనాలి

**సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి**

గజ్వేల్/ కొండపాక, మే 27: కేంద్రాల్లోని ధాన్యం తేమశాతం రాగానే వెంటనే కొనుగోలు చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం సింగాటం, కుకునూర్‌పల్లి మండలం తిప్పారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించి నిర్వాహకుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సింగాటం, తిప్పారంలోని కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగాటంలో ఇప్పటి వరకు 12,342క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి వడ్డేపల్లిలోని శివసాయి బాలాజీమిల్లులో దిగుమతి చేసినట్లు సెంటర్ నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. తిప్పారంలోని కొనుగోలు కేంద్రంలో 9వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి దుద్దెడలోని వరలక్ష్మి రైస్‌మిల్లుకు దిగుమతి చేసినట్లు సెంటర్ నిర్వాహకులు తెలిపారు. అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఉంచుకోవాలని, మిగిలిన ధాన్యాన్ని తేమశాతం రాగానే కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. డీఆర్డీవో జయదేవ్, సివిల్‌సప్లై డీఎం ప్రవీణ్, అదనపు డీఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్లుశ్రవణ్,సుజాత పాల్గొన్నారు.


సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం సింగాటంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

# కొనుగోలు కేంద్రాల్లో నిలువుదోపిడీ

- క్వింటాల్‌కు రెండున్నర కిలోలు దోచుకుంటున్న వైనం
- ఎలక్ట్రానిక్ కాంటాలను సెట్ చేసిన ఐకేపీ నిర్వాహకులు
- సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాలలో వెలుగు చూసిన ఘటన

చేర్యాల, మే 27 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఐకేపీ నిర్వాహకులు రైతులను నిట్టనిలువునా దోచుకుంటున్నారు. ధాన్యం తూకం వేసే ఎలక్ట్రానిక్ కాంటాలను సెట్ చేసి క్వింటాల్‌కు రెండున్నర కిలోలు కొట్టేస్తున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఎలక్ట్రానిక్ కాంటా సెట్టింగ్‌ను గుర్తించి నిర్వాహకులను నిలదీస్తే దోపిడీగుట్టురట్టయ్యింది. మర్రిముచ్చాల ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 8వేల క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారు. నిర్వాహకులు 40కిలోల బస్తాకు మరో కిలో అదనంగా వచ్చే విధంగా ఎలక్ట్రానిక్ కాంటా సెట్ చేశారు.41కిలోలు ఉన్న బస్తాను కాంటాపై పెడితే అది 40కిలోలు మాత్రమే చూపించే విధంగా చర్యలు తీసుకున్నారు. కేంద్రానికి వచ్చిన పలువురు రైతులు ఇటీవల ప్రైవేట్ కాంటా వద్దకు కేంద్రంలో 40కిలోలు తూకం వచ్చిన బస్తాను తీసుకువెళ్లి తూకం వేస్తే అక్కడ 41కిలోల బరువు చూపించింది. అనంతరం రైతులు కేంద్రం వద్దకు వచ్చి 20కిలోల తూనిక రాయిని పెట్టి తూకం వేయగా 19కిలోల500 గ్రాములు బరువు ఉన్నట్లు చూపించింది. దీంతో రైతులు కేంద్రం నిర్వాహకులను నిలదీశారు. రైతుల ఆగ్రహాన్ని గమనించిన నిర్వాహకులు తూకం వేసే కాంటా మరమ్మతుకు వచ్చిందని, దాన్ని ఉపయోగించవద్దని మెకానిక్ సైతం తెలియజేశాడన్నారు.


**200 క్వింటాళ్ల ధాన్యం స్వాహా?**

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొందరు ఎలక్ట్రానిక్ కాంటాలను ఉపయోగిస్తున్నారు.సదరు కాంటాలు ఉపయోగిస్తున్న కేంద్రాల్లో రైతుల నుంచి 40కిలోలకు మరో కిలో అదనంగా దోచేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎలక్ట్రానిక్ కాంటాలో తూకం వేస్తే రైతులు క్వింటాల్‌కు రెండున్నర కిలోల ధాన్యం నష్టపోతున్నారు. ఇదే కేంద్రంలో ఒక రోజు 903 ధాన్యం బస్తాలను నిర్వాహకులు కొనుగోలు చేసి మద్దూరు మండలంలోని ఓ రైస్‌మిల్లుకు పంపిన ట్రక్‌షీట్‌లో మాత్రం 914 బస్తాలుగా నమోదు చేశారు.ఒక్క రోజు నిర్వాహకులు కొనుగోలు చేసిన బస్తాలను పరిశీలిస్తే ఇప్పటి వరకు 8వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.అంటే ఒక్కో క్వింటాల్‌కు రెండున్నర కిలోలు నష్టం లెక్కిస్తే ఇప్పటి వరకు రైతులు 200 క్వింటాళ్ల వరకు నష్టపోయారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తెలుసుకున్న పౌరసరఫరాలశాఖ మేనేజర్ ప్రవీణ్, సెర్ప్ అదనపు పీడీ మధుసూదన్, డీపీఎం కరుణాకర్, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు.అధికారులు విచారణలో ఇప్పటి వరకు 225 బస్తాల ధాన్యం పక్కదారి పట్టినట్లు తేల్చారు.ఎలక్ట్రానిక్ కాంటాలో సెట్ చేశారనే విషయాన్ని అధికారులు గుర్తించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో ఉన్న కాంటాలను సైతం సీజ్ చేశారు. ప్రాథమికంగా అధికారులు సీసీతో పాటు వీవోవోపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.


సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల ఐకేపీ కేంద్రంలో వ్యత్యాసాన్ని చూపుతున్న ఎలక్ట్రానిక్ యంత్రం

**మిల్లర్లు, నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలి**

బీఆర్‌ఎస్ పాలనలో రైతులను రాజుగా తయారు చేస్తే కాంగ్రెస్ సర్కారు పాలనలో అన్నదాతను అన్ని విధాలుగా మోసం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే కాకుండా రాష్ట్రం మొత్తం ఇదే పరిస్థితి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రాల్లో రైతుల ధాన్యం దోచుకుంటున్న నిర్వాహకులతో పాటు కుమ్మక్కైన మిల్లరు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. సమగ్ర విచారణ జరిపి ధాన్యం నష్టపోయిన రైతులకు న్యాయంగా రావాల్సిన డబ్బులను అధికారులు చెల్లించాలి.



– జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


సిద్దిపేటలో జనుము విత్తనాల బస్తాలు

# ఎరువులు, విత్తనాల జాడేది?

- వానకాలం సాగుపై దృష్టి పెట్టని ప్రభుత్వం
- ఇంకా కల్లాల్లోనే ధాన్యం.. అకాల వర్షాలతో నష్టం
- జీలుగ, జనుము విత్తనాల కోసం రైతుల ఇబ్బందులు
- పెరిగిన విత్తనాల ధరలు .. పట్టించుకోని సర్కారు
- విత్తనాల కోసం క్యూలో పాస్‌బుక్కులు, ఇతర వస్తువులు


సంగారెడ్డి జిల్లా జోగిపేట వ్యవసాయ కార్యాలయం వద్ద విత్తనాల కోసం గుమ్మిగూడిన రైతులు (ఫైల్)

సిద్దిపేట,మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రోహిణి కార్తెలోనే వర్షాలు పడుతున్నాయి. రోహిణిలో విత్తనం విత్తుతే అధిక పంట దిగుబడి వస్తుంది అని రైతుల నమ్మకం. వారం రోజుల నుంచి సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రైతులు సాగు చేద్దామంటే..ఇప్పటి వరకు ఇంకా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు. ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో పడలేదు. వానకాలం సాగుకు విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో ప్రభుత్వం అందుబాటులో ఉంచలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో భూమిలో సారం పెరగటానికి, పంట దిగుబడి ఎక్కువ రావడానికి జీలుగ విత్తనాలు, జనుము, పెసరను ముందుగా సాగు చేస్తారు. గతేడాది కన్నా ఈ సంవత్సరం జీలుగ, జనుము విత్తనాల ధరలను రాష్ట్ర ప్రభుత్వం అధికం చేసింది. దీంతో రైతుల మీద మరింత భారం పడునున్నది. జీలుగ విత్తనాలు గత ఏడాది 30 కిలోల బ్యాగుకు రూ. 1120 తీసుకున్నారు. ఈ ఏడాది ప్రస్తుత వానకాలంలో అదే 30 కిలోల బ్యాగుకు రూ. 2140 తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. ఒక్క బ్యాగు మీద రూ. 1020 భారం పడుతుంది. ఇక జనుము విషయానికి వస్తే గత సంవత్సరం 40 కిలోల బ్యాగుకు రూ. 1400 ఉండగా ఈ ఏడాది దాని ధర రూ.2510 పెంచారు.ఇక్కడ ఒక్క బ్యాగు మీద రూ .1110 పెరిగింది. ఇలా ప్రతి దాని ధరలు పెంచి రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం బారం వేస్తుందని రైతులు మండి పడుతున్నారు. పిల్లిపెసర ఒక కేజీకి రూ.100 ఉంది. జీలుగ, జనుము, పిల్లిపెసర ఇవన్నీ భూమిలో సారం పెరగడానికి ఉపయోగ పడుతున్నాయి. దీంతో రైతులు విత్తనాల కోసం ఆగ్రో సెంటర్ల వద్ద బారులు తీరుతున్నారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పగలు, రాత్రుళ్లు విత్తనాల కోసం దుకాణాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. విత్తనాలు దొరకక ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. కనీసం జిల్లాకు చెందిన మంత్రులు వానకాలం సాగుపై కనీస సమీక్షలు చేయకపోవడంతో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేవు. రైతుల సంక్షేమ కోసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కర్షకులు మండి పడుతున్నారు. జీలుగ, జనుము విత్తనాల కోసం సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట క్యూలో రైతులు తమ పాస్‌బుక్కులు పెట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సాఫీగా విత్తనాలు అందింతే ఈ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్నీ కష్టాలే మొదలయ్యాయి. విత్తనాల నుంచి పంట చేతికి వచ్చి దానిని అమ్ముకునే దాకా రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు.

**ఎరువులు, విత్తనాల జాడ లేదు**

వానకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. కొన్ని చోట్ల రైతులు తమ భూములను సిద్ధం చేస్తున్నారు. రోహిణి కార్తెలో విత్తనాలు వేస్తే పంట అధిక దిగుబడి వస్తుంది. ఆదిశగా రైతులు తమ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచలేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట రైతులు విత్తనాల కోసం రోడ్డెక్కుతున్నారు. జిల్లాకు సరిపడే విధంగా ముందస్తు ప్రణాళిక ఇప్పటి వరకు లేదు. రిపోర్టు చెప్పడానికి కాగితాలు ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచకపోవడంతో గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్ముతున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు దోచుకుంటున్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అంట గడుతున్నారు.బ్లాక్‌లో నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. పేరుకు ఏదో ఒక్క షాపును విజిట్ చేసి మమ అనిపిస్తున్నారు తప్పా ఎక్కడా కఠిన చర్యలు తీసుకున్న సందర్భాలు కనిపించడం లేదు.

**దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు**

ఉమ్మడి మెదక్ జిల్లాలో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. అదును దాటితే అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రాదని ..రోహిణి కార్తెలోనే వరినార్లు పోసే పనిలో రైతులు ఉన్నారు. రోహిణి కార్తెలోనే వర్షాలు పడడంతో ఒక్కసారిగా వాతావారణం చల్లబడింది. రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు.ట్రాక్టర్లు, ఎద్దుల నాగళ్లతో దుక్కులు దున్నుతున్నారు. పశువుల ఎరువులు వేయడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా రైతాంగానికి అవసరమైన మేర విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం విఫలమైంది. సమైక్య రాష్ట్రంలో ఎరువులు, విత్తనాలు కావాలంటే రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం మళ్లీ అవే రోజులు గుర్తుకు వస్తున్నాయి.

# ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం


సిద్దిపేట జిల్లా చేర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- కాంగ్రెస్ పాలనలో ఎండిన తపాస్‌పల్లి రిజర్వాయర్
- స్థానిక సమరానికి గులాబీ సైనికులు సిద్ధంగా ఉండాలి
- నీలిమా దవాఖానలో రోజుకు 400 మందికి ఉచితంగా వైద్య సేవలు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- చేర్యాలలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

చేర్యాల, మే 27 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఎన్నడూ ఎండిపోని తపాస్‌పల్లి రిజర్వాయర్ కాంగ్రెస్‌లో మొదటిసారి ఎండిపోయిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని రేణుకా గార్డెన్స్‌లో చేర్యాలటౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు,ధూళిమిట్ట మండలాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు రూ.16,13,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలమైందని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు నిర్వహణ ఖర్చులు రూ.6కోట్లు మంజూరు చేసేందుకు పైసలు ఉండవని, అందాల పోటీలకు మాత్రం ఉంటాయంటే సర్కారు పరిస్థితి ఏమిటో ప్రజలు గమనించాలని కోరారు.గోదావరిలో సరిపడా జలాలు ఉన్నా దేవన్నపేట వద్ద పంపుహౌస్‌లో నాలుగు మోటర్లు ఆన్ చేస్తే సరిపోతుందన్నారు. నాడే కేసీఆర్ నీటిని ఎత్తిపోసేందుకు సరిపడా మోటర్లు ఏర్పాటు చేయించారని, ఆమోటర్లు ఆన్ చేసి నీళ్లు పోయించడం సర్కారుకు చేతకాకపోతే ఏమిటని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇవ్వలేదని, తులం బంగారం లేదని, వృద్ధులకు పింఛన్ ఇస్తలేరని కానీ అందాల పోటీలకు వందల కోట్లు ఖర్చు చేశారని హేద్దేవా చేశారు. చేర్యాల ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు బీఆర్‌ఎస్ సర్కారు నిధులు మంజూరు చేసి నూతన దవాఖాన భవనానికి శ్రీకారం చుడితే పనులు పూర్తి చేయకుండా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నదని, దీంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత దవాఖాన నీలిమాలో నియోజకవర్గానికి చెందిన 400 మందికి నిత్యం ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నానని, మరో మూడేండ్ల పాటు వైద్య సేవలు కొనసాగుతాయన్నారు. తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లు ఎండబెడితే ఎందుకు నీళ్లు నింపడం లేదని అసెంబ్లీలో సమయం వచ్చిన ప్రతిసారి ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని సంబంధిత మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. గతంలో రిజర్వాయర్లు నింపి చెరువులు నింపారని, ఇప్పుడు తపాస్‌పల్లిని ఎందుకు ఎడ్డబెట్టారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వాటిని ఎదుర్కొనేందుకు బీఆర్‌ఎస్ సైనికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ టౌన్, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మల్లేశం, సంతోష్, యాదగిరి, భిక్షపతి, మాజీ ఎంపీపీలు మేడిశెట్టి శ్రీధర్, వుల్లంపల్లి కరుణాకర్, తలారీ కీర్తనకిషన్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి,ముఖ్య నాయకులు శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్యపంతులు పాల్గొన్నారు.

# చేర్యాలలో నీటి సమస్య

**ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన మహిళలు**

చేర్యాల, మే 27 : సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని మొదటి వార్డు సాయిబాబా ఆలయ సమీపంలోని ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న కొద్దిపాటి నీటితో ప్రజలు సరిపెట్టుకుంటున్నారు.మంగళవారం వార్డులో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి సమస్యను తెలియజేసి వినపత్రం అందజేశారు.దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చందు, శ్రీనివాస్, శంకర్, పాండు, ఈ.రాజేశ్వరి, సరోజన, కోమలత, పెంటవ్వ, లావణ్య, శ్రీనివాస్, కళావతి, మంజుల, పి.శ్రీధర్, అరుణ, నగేశ్, సునీత, పద్మ, సురేఖ, కవిత, భారతి పాల్గొన్నారు.


సిద్దిపేట జిల్లా చేర్యాలలో నీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు


సంగారెడ్డిలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

సంగారెడ్డి, మే 27: ప్రభుత్వం అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులను నియమిస్తున్నా అడ్మిషన్లు పెరగకపోవడం శోచనీయమని, అడ్మిషన్లు పెంచే బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెలవుల్లో కూడా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు శిక్షణ శిబిరాలకు రావడం అభినందనీయమన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. గతంలో బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్లి ఎందుకు రావడం లేదని అడిగేవారని, ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేస్తున్న వసతులు ప్రచారం చేయాలని కోరారు. పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థులు రాటుదేలేలా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈవో విద్యాసాగర్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నర్సింహులు, నాయకులు విజేందర్‌రెడ్డి, రామప్ప, ఎర్రోళ్ల చిన్న, చిటుకుల మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిమ్జ్ బాధితుల ధర్నా


నిమ్జ్ బాధితులతో కలిసి సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు

సంగారెడ్డి, మే 27: ముఖ్యమంత్రి రేవంతరెడ్డి తన సొంత వ్యవసాయ భూమిని రూ. 15లక్షలకే పరిశ్రమల పెట్టుబడులకు ఇస్తాడా...లగచర్లకో న్యాయం..నిమ్జ్ బాధితులకు ఓ న్యాయమా అని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి పీఎస్ఆర్ గార్డెన్ నుంచి చౌరస్తా మీదుగా నిమ్జ్ బాధితులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ మార్కెట్ ధరపై మూడింతలు అదనంగా ఇవ్వాలని, ఇందుకు ప్రభుత్వం 2013చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ప్రతి ఎకరాకు 120గజాల ప్లాట్ ఇవ్వాలని, లేని పక్షంలో పారిశ్రామికవేత్తలనే కాదు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినా అడుగు పెట్టనీయమని స్పష్టంచేశారు. జహీరాబాద్ ప్రాంతంలో మార్కెట్ ధర ఎకరానికి రూ.50లక్షలు పలుకుతుందని, ప్రభుత్వం నిమ్జ్‌కు తీసుకుంటున్న భూములకు కేవలం ఎకరానికి రూ.15లక్షల పరిహారమే ఇస్తుందన్నారు. పేద రైతుల భూముల్ని తక్కువ పరిహారంతో లాక్కోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజాపాలన జపం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జహీరాబాద్ ప్రాంతంలో పర్యటనకొచ్చి వేలాది ఎకరాల భూముల్ని కోల్పోతున్న రైతుల గురించి కనీసం ప్రస్తావన చేయకపోవడం శోచనీయమన్నారు.రైతులు, ప్రజలకోసం పోరాడుతున్న సీపీఐఎం నాయకులను అరెస్టు చేసి నిర్బంధించారని, ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మానిక్, సాయిలు, నర్సింహులు, యాదగిరి, మహిపాల్, నాగేశ్వర్‌రావు, విద్యాసాగర్, కృష్ణ, కె.రాజయ్య, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.